# స్వార్థబుద్ధి

## ౧

పూర్వం ఒక దేశాన్ని సర్వజితుడనే రాజు పాలిస్తూ ఉండేవాడు. ఆయన చక్కదనానికి సహదేవుడూ, వివేకానికి నకులుడూ, పరాక్రమానికి అర్జునుడూ, బలానికి భీముడూ, ధర్మబుద్ధికి యుధిష్ఠిరుడూ, దాతృత్వానికి కర్ణుడూనూ. విరోధులపాలిటి యముడుగానూ, అనాథులపాలిటి కామధేనువుగానూ, ధర్మనిర్ణయానికి ప్రహ్లాదుడుగానూ ప్రవర్తించుతూ ఆయన చాలాకాలం దేశాన్ని అపూర్వంగా యేలి దివంగతుడైన పిమ్మట ఆయన యేకైక పుత్రుడు తేజస్వి సింహాసనం ఎక్కాడు.

తేజస్వి అన్నివిధాలా తండ్రికి విరుద్ధంగా ఉండేటట్టు కనిపించాడు. అమిత చిన్నతనం నించీకూడా అతను విపరీతమైన స్వార్థబుద్ధి ప్రకటించుతూ వచ్చాడు. అతనికి తనేమో తనసౌఖ్యమేమో తప్ప మరొక గొడవే పట్టేది కాదు. ఇతరుల కష్టసుఖాలతో సానుభూతి చూపటంగాని తన కష్టసుఖాలయందు ఇతరులు సానుభూతి చూపాలని

కోరటంగాని అతను ఎరగడు. అతను జీవితంలో మరొక ప్రాణికి అణుమాత్రం త్యాగం చూపి ఎరగడు.

అతని ప్రవర్తనను ఏమాత్రం ఇతరులు అరికట్టజూచినా అతను సహించలేక పొయ్యేవాడు. "నా ప్రవర్తనవల్ల నేనే నష్టపడే టట్టయితే నీకెందుకూ? లేక నీకే నష్టం వచ్చే టట్టయితే నాకేం?" అని తర్కించేవాడు.

ఈస్వార్థబుద్ధి తప్ప అతనిలో మరేమీ లేదు. ఇతరుల ప్రవర్తనను అతను యేవిధంగానూ అరికట్టచూచేవాడు కాడు. ఇతరులమీద అధికారం చెలాయించాలని గాని వారిమెప్పు సంపాదించాలని గాని అతనికి ఉండేది కాదు. అయినప్పటికీ ఆస్వార్థమే అతనికి పెద్దకళంకమయి ప్రజల దృష్టిలో అతనికి సంపూర్ణమైన గౌరవం లేకుండా చేసింది.

తండ్రి చచ్చిపోయినప్పుడు సింహాసన మెక్కటానికీ పట్టాభిషేకం చేసుకోవటానికీ తేజస్వి కొంచెం అభ్యంతరం పెట్టాడు. "నాకీఉద్యోగం అవసరం లేదు. నేను సింహాసనం ఎక్కినట్టుగానే భావించుకుని మీరు రాజ్యాంగం నడపండి!" అని అతను మంత్రితో అన్నాడు.

"అట్లాకాదు, మహాప్రభూ! మీరు సింహాసనంమీద నామమాత్రం ఉంటేనేగాని పరిపాలన సాగదు. మీరు ప్రజలదృష్టికి దేవేంద్రస్థానం. మీరు లేకపోతే నేనేమీ చెయ్యలేను. మీరు సింహాసనంమీద ఉంటేరా, బాధ్యతా, భారమూ నేనే వహించి ఎంతపనిఅయినా చెయ్యగలను. ఈషణ్మాత్రమైనా శ్రమకలగనివ్వను," అని మంత్రిగారుబోధచేసి అతన్ని పట్టాభిషేకానికి ఒప్పించాడు.

తేజస్వి అనుమానిస్తూనే సింహాసనం ఎక్కాడు.

అతని రాజరికం ఎవరికీ తృప్తికలిగించలేదు. ఆస్థాన పెద్దలంతా పెదవులువిరిచారు, అతనికి ఒకవిషయమైనా తెలియదన్నారు. రాజకీవికూడా అతనిదగ్గర లేదన్నారు. అంతసమర్థుడితరవాత ఇంత ఉదాసీనుడూ అసమర్థుడూ రాజుకావటం శోచనీయమన్నారు.

నిజానికి అతనికి చిన్నతనంలో చదువుగాని ఆచారాలు గాని అబ్బలేదు. తను ఎవరో, ఏ ప్రపంచంలో ఉన్నాడో తెలియనట్టు ప్రవర్తించేవాడు. ఆఖరుకు ధర్మశాస్త్రం కూడా అతనికి తెలియదు. న్యాయచట్టమేమిటో న్యాయ నిర్ణయసంప్రదాయం ఎట్లాఉంటున్నదో అదికూడా అతనికి తెలియదు. తనచుట్టుప్రక్కల వాళ్ళంతా ఎట్లాజీవిస్తున్నారో, కనీసం అదయినా తెలుసుకోకుండా జీవించ గలిగాడంటే తేజస్విని చూసి ఆశ్చర్యపడే వాళ్ళుకూడా లేకపోలేదు.

అతనికి తెలిసిందల్లా ఒకటే—తనసుఖం. దానికోసం అతను చెయ్యి చాచేటప్పుడు తనరీవికే ఆపద కలుగుతున్నదో, సంప్రదాయమే చెడిపోతున్నదో, న్యాయానికే భంగపాటు కలుగుతున్నదో యోచించేవాడుకాదు.

రాజుగారయికూడా తేజస్వి తనవెంట భటులను ఉండనిచ్చేవాడుకాదు, తనకు అవసరంలేని సపర్యలు లాంఛనగా చెయ్యనిచ్చేవాడుకాదు, తనకు ఒంటరిగా ఉండబుద్ధిపుట్టినప్పుడు అందరినీ దూరంగా తరిమివేసేవాడు.

రాజు అసమర్థుడని తేలిపోగానే పెద్దలందరికీ రాజంటే

అలుసయిపోయింది. అతనికి ఉత్సవవిగ్రహం అని పేరు పెట్టారు. సభకు వచ్చినా, తేజస్వి ఏ చర్చలోనూ ప్రవేశించేవాడు కాదు. అతని తరఫున మంత్రిగారే నోరు చేసుకుంటూ ఉండేవాడు. అతని దారిన అతను ఏవైనా పుస్తకాలు చదువుకోవటంగాని, బొమ్మలు గియ్యటం కాని లేకపోతే సింహాసనంలో చేరగిలబడి నిద్రపోవటంగాని చేస్తూ ఉండేవాడు. నలుగురూ ఏదైనా గంభీర విషయం చర్చిస్తున్నప్పుడు తేజస్వి అకస్మాత్తుగా మంత్రిని పిలిచి "ఎవరినన్నా పాడేవాళ్ళని పిలిపించండి!" అనేవాడు. మంత్రి రహస్యంగా చెవిలో, "ప్రభూ, ఇది సమయం కాదు!" అంటే అతను చివాలున లేచి వెళ్ళిపోయి గాయకులనూ నటకులనూ అంతఃపురానికే పిలిపించుకునేవాడు. ఆ విధంగా సభ ముగిసేది.

కాని రానురాను ఈ అభ్యాసం తేజస్విలో జాస్తి కావటం వల్ల అతను వెళ్ళిపోయిన తరవాత కూడా అతను మళ్ళీ త్వరలోనే తిరిగివస్తాడనే మిషమీద చర్చలు సాగించటమూ సభ ముగించక పోవటమూ ఆచారంగా పరిణమించింది.

## 2

తేజస్వి పరిపాలనలో ఆస్థానం లొల్లి అయినట్టే పరిపాలన కూడా లొల్లి అయింది. మంత్రి అంతులేని అధికారం చలాయిస్తున్నాడు. రాజుగారికీ ఆయన ముద్రకూ తేడా

లేకపోయింది. ఆస్థానంలో అనేకమంది అధికారం కోసం మంత్రిమీదికి పోటీరావటంవల్ల కక్షలు ఏర్పడినై. మంత్రి గారివిరోధులు అనేకమంది రాజుగారిని తమవైపు తిప్పు కుందామని వ్యర్థప్రయత్నంచేశారు. రాజుగారి చెవి కొరక బోయినవారంతా తమ నాలుకలే కొరుక్కోవలసివచ్చింది.

కాని మంత్రిగారి విరోధులు అంతతో ఓడిపూర్చక ప్రజలో ప్రబోధం సాగించారు. రాజువట్టి అప్రయోజకుడనీ మంత్రి తనకు లేని అధికారాన్నికూడా చలాయిస్తున్నాడనీ వారు జనసామాన్యంలో ప్రచారం ప్రారంభించారు.

నిజానికి ఇది వృథాప్రచారం. ఎందువల్లనంటే, మంత్రి గారు రాజుగారి అధికారం కూడా తనమీదనే వేసుకోవ టంవల్ల ప్రజలకు కలిగిన నష్టమేమీ లేదు. ఈ ఏర్పాటుకు అభ్యంతరం ఏమైనా ఉంటే అదిరాజుగారికే ఉండాలి. కాని ప్రజలు అట్లాఅనుకుని ఊరుకోలేదు. అట్లా అను కోవటం ప్రజల మనస్తత్వానికి సరిపడదు. రాజుగారి జులుము సవ్యమైనట్టూ, అదిరాజుగారివల్ల వస్తేనే తమకు రుచించేటట్టూ, దాన్ని రాజుగారి బదులు మంత్రిగారు అవలంబించగానే తమ జీవితమంతా తలకిందయినట్టూ ప్రజలు భావించారు. ప్రజలలో మంత్రిగారి మీద ఒక విధమైన అవిశ్వాసంబయలుదేరి క్రమంగా ఒకచిన్న ఉద్య మంగా పరిణమించింది. ఈ అన్యాయాన్ని సహించలేని వాళ్లు కొందరు రహస్యంగా ఒకసమాజం అయినారు. మంత్రిగారికి తెలియకుండా వాళ్లు రహస్య సభలుచేసి కర్తవ్యం ఆలోచించారు.

కానివేగుల వాళ్ళవల్ల మంత్రి ఈ రహస్యోద్యమం గురించి చాలా వివరాలూ తెలుసుకుని, ఉద్యమానికి తలలుగా ఉన్న కలుగు రైదుగురిని రాజద్రోహుల కింద విచారణ లేకుండా ఖైదులో పెట్టించాడు.

మంత్రిగారికి విరుద్ధంగా ఉద్యమం ఎందుకు సాగించుతున్నారో ప్రజలకు తెలియనట్టే, ఆ ఉద్యమాన్ని ఎందుకు ప్రతిఘటించుతున్నదీ మంత్రి రాజుగారికి తెలియదు; పరిపాలనలో రాజు కల్పించుకోక పోయినప్పుడు మంత్రి రాజుగారి తరఫున కూడా పనిచెయ్యటంలో తప్పులేదు. అట్లా చెయ్యకపోయినట్టయితే దేశం అరాజకమయిపోతుంది.

ప్రజలూ మంత్రీ ఒకరినొకరు ప్రతిఘటించారు. మంత్రి చేతిలో అధికారం ఉంది. ప్రజలకు విసుగెత్తకుండా వారికి ప్రోత్సాహ మిచ్చి అగ్నిలో ఆజ్యంపోసినట్టునడుచుకుంటున్న ఆస్థానపెద్దలు మంత్రికి పగవాళ్ళుగా ఉండటం వల్ల ఈ ఘర్షణ నానాటికి తీవ్రరూపం ధరించింది. రెండు పక్షాలా ఉద్రేకం హెచ్చిన కొద్దీ నిజం తెలుసుకునేశక్తి తగ్గిపోయింది.

తనరాజ్యంలో జరుగుతున్న ఈ అల్లకల్లోలం తేజస్వి ఎరగడు. ఎవరైనా అతనితో ఆవిషయం పనిపెట్టుకుని చెప్పినా అదంతా మరుక్షణమే నిశ్చింతగా మరిచిపోయి ఉండేవాడే తేజస్వి.

ఈ ఉద్యమానికి నాయకులయిన వారంతా క్రమంగా ఖైదుచేరుతున్నారు. వారిస్థానే కొత్తనాయకులు వస్తున్నారు. ఒక్కొక్క నాయకుడి చేతిలోపడి ఉద్యమం

ఒక్కొక్కకొత్త స్వరూపం పొందుతున్నది. ఉద్యమం వ్యాపించటానికి మంత్రిగారి దౌర్జన్యంతోపాటు ఆయన కుటుంబంలో ఏడుతరాలనించీ ఉండిఉండిన కుళ్లుయావత్తు పైకిలాగబడి ప్రచారం పొందుతున్నది. ఉద్యమంలో సానుభూతి ఉన్న వారందరి ప్రాణాలకూ మంత్రిగారు రావణ కుంభకర్ణుల శ్రేణిలో చేరినవాడయిపోయినాడు.

ఉద్యమాగ్నికి ఆజ్యం పోస్తున్నవారికి ఆశయూ లేమీ లేవు—మంత్రిగారి మీద విరుద్ధ ప్రచారం తప్ప. వారి మొరఎవరు విని ఉన్నపరిస్థితులు సంస్కరిస్తారో ఎవరికీ స్పష్టంగా తెలియదు. రాజుగారి పినతండ్రిని కాని ఆయన కుమారుణ్ణిగాని రాజుగా చెయ్యటమనేదీ, రాజుగారిని వివాహంచేసుకోమని నిర్బంధించి ఆయనకు కుమారుడు కలగగానే ఆపిల్లవాణ్ణి రాజు చేయ్యటమనేదీ—రెండు అభిప్రాయాలు ప్రచారంలో ఉన్నై. కాని వాటిని సమర్థించేటందుకే ధర్మశాస్త్రం గాని ఆచారంగాని ఆధారం కనిపించలేదు.

ఆస్థాన పెద్దలు అటు జనంలో కలవరం పుట్టించి ఆవిషయం తెచ్చి తేజస్వికి తెలియచేశారు. తేజస్వి చాలా సౌమ్యంగా "ఎవరెట్లాచస్తే మనకెందుకు?" అని తేల్చేశాడు.

ఎప్పుడైనా రాజుగారు ఒంటిరిగా ఉద్యానవనానికి పోతూ ఉండేవాడు. అతని అంగరక్షకులు గోప్యంగా అతన్ని అనుసరిస్తూ ఉండేవారు. ఇట్లా వెళ్ళుతుండగా ఒకనాడు తేజస్విని ఒకపాతికమంది జనంవచ్చి చుట్టుముట్టారు. పాపం వారి అభిప్రాయం తమ ఉద్యమంగురించి

రాజుగారికి మనవిచెయ్యాలనే. కాని వారు రాజును చుట్టి ముట్టిన మరుక్షణమే రాజుగారి అంగరక్షకులు కత్తులు దూసి ఆజనంమీద పడి చిత్రవధ చెయ్యసాగారు. పది మందికి గాయాలయినై, నలుగురు అక్కడే ప్రాణాలు విడిచారు.

తేజస్వి కోపంపట్టలేక తన అంగరక్షకులను తన వట్టి చేతులతో బాదాడు.

"మీరెవర్రా? యేమిటీ దౌర్జన్యం?" అని కేకలు పెట్టా డతను.

"ప్రభూ, తమరాజ్యంలో యెంత కుట్రలు జరుగు తున్నయ్యో తమ రెరగరు. మేం సమయానికి కమ్ముకోనక పోతే ఈనాడు ప్రభువుగారు యేమైఉండురో!" అన్నారు అంగరక్షకులు.

"మీతలకాయ! వాళ్లు నన్నేంచేస్తారు? ఎందుకు చేస్తారు? నన్ను చంపితే వాళ్ళకేమి ఒరుగుతుంది? మీరెందుకు నావెంట తద్దినం, పొండి!" అని రాజు గద్దించాడు.

ఈలోపల అప్పుడే నాలుగువైపులా వార్త వెళ్లింది, రాజుగారిని రాజద్రోహులు చుట్టిముట్టి హత్యచెయ్యబోయి నారనీ, అంగరక్షకులు సమయానికి అడ్డపడ్డారనీ. రాజు గారు అక్కడనించి కదిలి నాలుగడుగులు వేసేలోపల అనేక వందలమంది చుట్టుముట్టారు.

తేజస్వి ఇదంతా సహించలేకపోయినాడు. "మీరంతా నన్నెందుకిట్లా చుట్టుముట్టారు? వెళ్లిపొండి నాతో

మాట్లాడదలచినవాళ్ళు ఇద్దరో ముగ్గురో తోటదగ్గిరికి వచ్చి నన్నుకలుసుకోండి !'' అంటూ అతను సాగివెళ్లాడు.

అతను కోరినప్రకారం ఇద్దరు వాక్యూరులు తోటదగ్గిర అతని దర్శనం చేసుకున్నారు, మంత్రిగారి దౌర్జన్యాలన్నీ అతనికి విన్నవించుకున్నారు. మంత్రిగారు రాజుగారి అధికారంకూడా చలాయిస్తున్న సంగతి తెలుపుకున్నారు.

"తమరు మా ప్రభువులు. మీరేమన్నా చెయ్యండి మేంసహిస్తాం, మీకోసం ప్రాణాలర్పిస్తాం, కాని మంత్రిగారెవరు ? శాసనం చెయ్యటానికి ఆయనకేమి అధికారం? యేలినవారు శాసనము చెయ్యటమూ, ఆయన ఆశాసనాన్ని అమలులో పెట్టటమూ ధర్మం! ఆయనకోసం ప్రాణాలు విడవటం మా ధర్మంకాదు.

తేజస్వి అంతా విని, "మీరు మూర్ఖులు! లేక అబద్దాలాడుతున్నారు! మీరు చావటానికి అభ్యంతరం లేకపోయినట్టయితే ఎవరికోసం చస్తేమాత్రం ఏమిటి? నాకోసం చచ్చేకన్న మీరు మంత్రిగారికోసం చస్తే నేనెక్కువ సంతోషిస్తాను. సరా? శాసనం చెయ్యటం నావల్ల కాదు. అది దిక్కుమాలినపని. మంత్రిగారు మంచివారు కనక అది నెత్తినవేసుకున్నాడు. నామీద ఆధారపడేటట్టయితే మీకసలు శాసనమే లభించదు. మీకు నిజంగా శాసనం కావాలని ఉంటే మంత్రిగారి శాసనం ఆమోదించండి. శాసనం అక్కర్లేదూ? హాయిగా రాజ్యం విడిచి పెట్టి పొండి. అంతేగాని, 'మాకు శాసనం, కావాలి. అది నువే చెయ్యాలి!' అంటేమాత్రం ప్రయోజనం లేదు.

ఇక పదండి," అని తీర్పు చెప్పాడు.

రాజుగారి సమాధానం ఎవరికీ తృప్తి కలిగించలేదు. తమ రాజభక్తిని ఆయన తేలిక చెయ్యటం వారికిఆగ్రహం తెప్పించింది. కాని రాజుగారికి తిరిగి సమాధానం చెప్ప టానికి ప్రజలకేమీ కనిపించలేదు. రాజుగారు కేవలమూ మందమతి కాడేమోనని ఒకరిద్దరు సూక్ష్మబుద్ధులు భావించ గలిగారు ఆయన మాటలను బట్టి.

రాజుగారి మాటలు మంత్రిగారి అనుచరులకూ నచ్చ లేదు. "రాజుగారు రాజద్రోహానికి దోహదం చేస్తున్నారు. రాజభక్తిని తేలిక చేస్తున్నారు!" అన్నారు మంత్రి తరఫు వారు. కాని మంత్రిగారు మాత్రం నవ్వి ఊరుకున్నారు.

త్వరలోనే ఈఉద్యమం అంతరించింది. నాయకులంతా జైలునించి విడుదల అయి, మంత్రిపక్షం అవలంబించి పద వులు సంపాదించుకున్నారు. ప్రజలు మంత్రిగారి సంపూర్ణ శాసనానికి అలవాటయినారు.

మంత్రిగారికి కొన్ని కొత్తచిహ్నాలూ, బిరుదులూ ఏర్పాటై, రాజ్యాంగంలో ఆయనస్థానం అగ్రస్థానం అయింది.

## 3

తేజస్వికి ఇరవై ఎనిమిదో ఏడు నడుస్తున్నది. అతనింకా పెళ్ళిప్రయత్నం తలపెట్టలేదు. కాని అతను ఇంద్రియా లను కట్టిపెట్టలేదు. అనేకమంది స్త్రీలను అతను దగ్గిరికి

చేర్చాడు. పైగా ఈ అవినీతిప్రవర్తనను గోప్యంగా ఉంచటానికి అతను ఎటువంటి ప్రయత్నమూ చెయ్యలేదు. అతను ఎక్కడ ఉండగా ఎప్పుడు ఏ స్త్రీ అతనిదగ్గిరికి వెళ్ళిందో మంత్రిగారిదగ్గిర జాబితా ఉండేది.

రాజుగారు స్త్రీ వ్యసనంలోపడి తననూ ప్రపంచాన్నీ కూడా మరిచిపోయినాడని ఆందోళనచేసినవాళ్ళు పొరపాటుపడ్డారు. అతను ప్రపంచాన్ని ఎప్పుడూ ఎరగడు, తన్ను తాను ఎన్నడూ మరవలేదు; అతనికి స్త్రీ వ్యసనం కాలేదు. అతనికి ఏ వ్యసనమూ లేదు. ఇతరులకన్న అతనికి స్త్రీ వాంఛ అధికంగా ఉండలేదుకాని ఇతరులకన్న అతను స్త్రీనించి ఎక్కువ సుఖంమాత్రం పొందుతూ వచ్చాడు.

స్త్రీని గాఢంగా ప్రేమించే అవకాశం అతనికి లభించలేదు. ఎందుచేతనంటే అతను తన అవినీతిని గోప్యంగా అట్టేపెట్టకపోవటంచేత పరువుమర్యాదలు కావలిసిన ఉత్తమస్త్రీలు అతన్ని సమీపించటానికి వెనకాడారు. సాహసించి అతనిదగ్గిరికివచ్చిన ఆడవాళ్ళంతా రెండోరకంవాళ్ళే. పైగా అంత స్వార్థపరుణ్ణి మనస్ఫూర్తిగా ఏ స్త్రీ ప్రేమిస్తుంది ?

ఒకనాడు మంత్రిగారు రాజుగారితో లౌక్యంగా ఈ విషయమై హెచ్చరించాడు.

"తమను ప్రజలు ఆదర్శపురుషుడికింద స్వీకరించగలిగి ఉండాలి. యథా రాజా తథా ప్రజా. మీరే ఇట్లా అవినీతిగా ప్రవర్తించితే ప్రజలను పట్టపగ్గాలుండవు!" అని

తేల్చాడు మంత్రి.

"నేను చేసేది అవినీతి అయేటట్టయితే నీతి చట్టంలో మార్పులు చేయించండి. ఏమంటే, నేనిట్లాగే కాలం వెళ్ల బుచ్చదలిచాను. ప్రజలంతా నామాదిరిగా ప్రవర్తించితే నష్టమేమిటో నాకు తెలియకుండా ఉంది. ఏమైనా నష్టం ఉంటే నాకేమీ ఫరవాలేదు."

"తమరు ప్రభువు. సామాన్యనీతి తమరిని బాధిస్తుందని కాదు. కాని అవినీతిలోనైనా తమరు శాస్త్ర రసికత్వం చూడాలిమరి! మీదగ్గిరికివచ్చే స్త్రీలు అంతగా ఘనమైన వాళ్ళు కారేమోనని నాసందేహం."

"నేనేంచెయ్యను ? ఇంతకంటే ఘనమైన స్త్రీలు నా దగ్గిరికివస్తే నాకేమీ అభ్యంతరం లేదు."

"తమ ధర్మం తమరు మరిచిపోతున్నారు. ఉత్తమజాతి స్త్రీలతో వ్యభిచారం చెయ్యమనే నా అభిప్రాయంకాదు. ఉత్తమ కన్యను వివాహమాడి సంతానం కనటం తమ విధి."

"వివాహమాడకుండా సంతానం కనరాదా ? నాకు శాశ్వతమైన భార్య ఇష్టంలేదు. నాకు అవసరం లేనప్పుడు వదిలించుకోవటానికి అవకాశంఉండే తాత్కాలిక వివాహమే నాకు బాగుంది. నాతల్లిదండ్రులు ఒకరినొకరు ఎటువంటి గర్భశత్రుత్వంతో చూసుకునేవారో నేనెరుగుదును. అటువంటి గతి పగవాళ్ళకుకూడా వద్దు."

మంత్రిగారు విసిగి ఊరుకున్నాడు.

రాజుగారి ఆస్థానంలోఒక పెద్దమనిషి ఉండేవాడు. ఆయన

పదిపన్నెండు గ్రామాలు కలవాడు. వయసుమళ్ళిన తర వాత రెండో వివాహం చేసుకున్నాడు. కొంచెం తక్కువ కుటుంబానికి చెందినా ఆయన భార్య అతిరూపవతి, వివేకవతి.

ఒకనాడు రాజుగారు ఉద్యానవనంలో పెద్దలందరికీ విందుచేశాడు. ఆవిందుకు పెద్దలంతా వచ్చారు. వారిలో పైనచెప్పిన పెద్దమనిషీ అతని భార్యాకూడా ఉన్నారు. ఆమెను చూడగానే తేజస్వికి మతిచెడినట్లయింది. ఇంతకాల మూ తను రహస్యంగా ఆరాధిస్తూ ఉండిన స్త్రీ ఆమే నని పించింది. ఆమెపేరు వాసంతిక అని తెలుసుకున్నాడు.

ఆమెమాత్రం కన్నెత్తి అతనివంకనైనా చూసినట్టు లేదు.

వాసంతిక కోసం రాజు తహ తహ లాడ సాగాడు. ఆమెను ఎట్లా సంపాదించాలో అతనికి తెలియలేదు. అతను తల్లిదగ్గిరికి వెళ్ళి ఆమెను వేడుకున్నాడు, ఒకసారి వాసంతి కను పిలిపించమని. ఆవిడ అతనికి చాలా హితబోధచేసింది కాని అతని తలకెక్కలేదు.

"నువ్వు చెప్పే ధర్మం నాకర్థంగాదు. నేను వాసంతి కను బలాత్కరించను. ఆమెకూ నాకూ ఇష్టమైతే కూడా ఇతరుల కేందు కభ్యంతరం ఉండాలో నాకు తెలియటం లేదు!" అన్నాడతను.

ఆరోజురాత్రి రాజమాత వాసంతికను ఏదోమిషమీద అంతఃపురానికిపిలిపించింది. ఆనాడుఆమెభర్తకూడా ఊళ్లో లేడు. ఆమెవచ్చేటప్పటికి తల్లికొడుకులుమాత్రమేఉన్నారు.

పరిచారికలుకూడా ఎవరూ సమీపంలో లేరు.

రాజమాత వాసంతికను ఎంతో ప్రేమతో ఆహ్వానించింది. రెండు నిమిషాల వరకూ స్త్రీలిద్దరూ ఏదో లోకాభిరామాయణం మాట్లాడిన తరవాత రాజ మాత లేచి, "నీకొక చక్కని మణిహారం చూపించాలని పిలిపించానమ్మాయి. ఉండు తెస్తాను. అబ్బాయితో మాట్లాడుతూ ఉండు!" అని జారుకుంది.

కాని వాసంతిక అబ్బాయి కేసి చూడనైనా లేదు. అబ్బాయి కళ్ళుమాత్రం ఆమె సౌందర్యానికి అంటుకుపోయినై. అయిదు నిమిషాలు గడిచింది. వాసంతిక మాటి మాటికీ రాజమాత వెళ్ళిన దిక్కే చూస్తున్నది.

తేజస్వి తన ఆసనం మీదినించి లేచివచ్చి ఆమె పక్కనే మోకరించి కూర్చుని ఆమె కూర్చున్న ఆసనం మీద చెయ్యివేసి "వాసంతికా!" అన్నాడు.

ఆమె లేచి నిలబడ్డది. కాని రెండో చెయ్యికూడా అడ్డంపెట్టి అతను ఆమెను కదలనివ్వలేదు.

, ఆమె మొదటిసారి అతనికేసి చూస్తూ "లేవండి!" అన్నది.

తేజస్వి నవ్వుతూ, "ఆజ్ఞా?" అన్నాడు.

"కాదు."

"అయితే నువ్వు కూర్చో. ఇది ఆజ్ఞ!"

వాసంతిక కొంచెం ఆలోచించి కూర్చున్నది.

"నావంక చూడనైనా చూడవు, నేను నీకేం ద్రోహం చేశాను? నిన్ను చూచిన క్షణంనించీ నేనింకేమీ చూడ

లేకుండా ఉన్నానే!"

వాసంతిక మాట్లాడ లేదు.

"నీపేరు విన్నప్పుడు నావళ్ళు పులకరించింది. నువ్వు నాయెదటికి రాగానే మలయమారుతం వీచింది. నీకళ్ళు చూడగానే స్వచ్ఛనీలాకాశం కనపడ్డది. నీపెదవులు చూడగానే మామిడిచిగుళ్లు స్ఫురించినై. నువు మాట్లాడితే కోయిల పాటలు వినిపించినై. నీపేరు ఊహించలేక పోయినాను—మందమతిని!"

"ఇదంతా నాతో ఎందుకు చెబుతున్నారూ?"

"ఈమాటలు వినడానికి నీకొక్కర్తెకే అధికారం ఉంది. అందుకని! ఇతరస్త్రీలతో ఎన్నివిధాల సుఖంఅనుభవించినా నిన్నుచూసిన ఆనందం కలగలేదు."

"ఆగారేం?"

"నాకింకేమీ లేదూ చెప్పటానికి."

"ఎందుకులేమీ? నేనే మీహృదయలక్ష్మినని! నేను మీదాన్ని అయినట్టయితే మీరు మరొక స్త్రీని తలవరు! సూర్యచంద్రాదు లున్నంతవరకూ మీకు నామీది ప్రేమ చలించదు! అదంతా చెప్పరేం?"

తేజస్వి నిట్టూర్చాడు. "నేను మానవమాత్రుణ్ణి. నాఅదృష్టానికి పరిమితిఉంది. నిన్ను యావజ్జీవమూ ప్రేమించే అదృష్టం నాకు ఉంటుందా? నాకు నమ్మకం లేదు. రెండు రోజులన్నా గడవకపూర్వమే వెధవమనస్సు యేదో మిష పెట్టి విరిగిపోతుంది. ఆతరవాత మరిరెండు రోజులపాటు యేమీ జరగనట్టు నటించుతాం. మళ్లా ప్రపంచం యథా

పరిష్కారం అవుతుంది. కోయిలకూతలు వినిపించవు. మామిడి చిగుళ్ళు కనిపించవు. మనం మబ్బుల్లోనించి కిందికి దిగివచ్చేస్తాం," అన్నాడతను.

వాసంతిక అతనికేసి కాసేపు ఆశ్చర్యకరంగాచూసింది. తేజస్వి వంచకుడని ఆమె వినివున్నది గాని అతనివంచన అనుకున్నట్టుగా లేదు.

"అయితేమాత్రమేం ?" అన్నదామె.

రాజు నిద్రమేలుకొన్నవాడల్లే అయి "అంటే ?" అన్నాడు.

"ఆడదానికి మగవాడు జరగబొయ్యేదాన్ని గురించి నిజంచెప్పాలని ఏముందీ ?—జరిగినదాన్ని గురించి అబద్ధాలు చెప్పినప్పుడు !"

"అంటే నేనిందాకటినించీ నీతో అబద్ధాలాడుతున్నాననా ? అబద్ధాలెందుకూ ?"

"మీకు నిజంగానే నామీద అంత ఘనమైన అభిప్రాయం కలిగిందనుకోనా ?"

"పిచ్చిదానా, నేను చెప్పేమాటలుతప్ప నీకేమాధారం ఉంటుంది, నామనస్సు తెలుసుకోవటానికి ?"

"పోనివ్వండి. మీమనస్సు తెలుసుకున్నాను. నన్నిక ఏంచెయ్యమన్నారు ?"

"అది నీయిష్టం !"

"మీఅనుజ్ఞఅయితే నేనిక లేస్తాను."

"దేనికీ ?"

"ఇంటికి వెళ్ళటానికి."

రాజు మోకరించినచోటినించిలేచి ఎడంగా నిలబడ్డాడు.

"మహారాణిగారు నాసంగతి మరిచిపోయి ఉంటారు. నేను వారికోసం చాలాసేపు కనిపెట్టుకునిఉండి వెళ్ళానని చెప్పండి."

"చెబుతాను."

వాసంతిక కొంతదూరంవెళ్ళి ఆగి వెనక్కు తిరిగి చూసింది.

"నాఇష్టంవచ్చినట్టు చెయ్యమన్నారు. నాఇష్టంవచ్చినట్టు చెయ్యటంలేదు. నేను మరొకరి భార్యను!" అంటూ ఆమె సాగిపోయింది.

ఆమె గడపదాటేవరకూ అతనికి ఆమె మాట సొంతం అర్థంకాలేదు. అతను ఆకస్మికోద్రేకంతో లంఘించి ఆమె చెయ్యి పట్టుకున్నాడు.

## ౪

**పండువెన్నెల్లో** ఇద్దరూ మేడమీద మెత్తని తివాసీలపైన కూర్చున్నారు. కొద్దిగా చెరిగినజుట్టూ, వాడినచెక్కిళ్ళూ, నలిగిన చీరా, స్వర్గం సందర్శించి వచ్చినట్టున్నమొహమూ, కొద్దిగా మూతపడిన కళ్ళూ పెట్టుకుని వాసంతిక అతని ఒళ్ళో అతన్ని పొదువుకుని కూర్చుంది. అతనామెను చిన్నపిల్లను ఊపినట్టు ఊపుతూ ఆలోచిస్తున్నాడు. ఒక గంటక్రితం ఆమనిషి ఎవరు తనకు? ఇప్పుడు? ఇంతలో ఆమె తనకింత దగ్గరమనిషి ఎట్లాఅయింది? ఆమె ఇతర

స్త్రీల మాదిరిగా తనని సుఖపెట్టి ఆగలేదు. తనగుండెను కనబడకుండా నములుతున్నది. ఈక్షణంవరకూ తనలో ఇంత మానవత్వం ఉందని అతనికి తెలియనే తెలియదు.

అతను అకస్మాత్తుగా ఆలోచన కట్టిపెట్టి ఆమెను తన వైపు తిప్పుకుని చిన్నపిల్లను పట్టుకున్నట్టు ఎడంగా పట్టుకుని గంభీరంగా, "నువ్వెవరు?" అన్నాడు.

"మీకు తెలీదూ?" అన్నదామె బద్ధకంగా నవ్వి అంత కన్న బద్ధకంగా అతనికేసి కళ్ళెత్తి చూస్తూ.

"అదికాదు. ఎవరు నువ్వు? నామీద నీకింత అధికారం ఎవరిచ్చారు — ఎట్లావచ్చింది? నువ్వు లేకుండా నేనింతకాలం ఎట్లాగడిపాను? ఒక్కసారి ఎక్కణ్ణించో ఊడిపడి నా వెనకటి జీవితమంతా కలమాదిరిగా ఎట్లా చెయ్యగలిగావు?"

"నేనెవర్నీ అడగను?"

"ఏమని?"

"ఒక సామాన్యపు ఆడదాన్ని పట్టుకుని మీరిట్లా స్వర్గ వీధుల్లో ఎందుకు తిప్పాలి? ఇట్లా పవిత్రమైన ఈశరీరాన్ని రేపు మళ్ళీ ఒక ముసలాడు ఎవరి అనుజ్ఞా లేకుండా అపవిత్రం చేస్తాడు. మీకు జరిగిందంతా కలగాఉంది. నాకు జరిగిందంతా పీడకల! పైగా ఆపీడకల నన్నువదిలిపెట్టదు. నాకోసం అది మాఇంటిదగ్గిర కనిపెట్టుకుని ఉంటుంది. నేనేంచెయ్యాలి?"

భావిని గురించిన ఆలోచన రాగానే రాజు మెదడులో ఉన్న కవిత్వమంతా విచ్చిపోయినట్టయింది.

"ఈదౌర్భాగ్యపు పెళ్లిళ్ళు ఏఉద్దేశ్యంతో పెట్టేడుంటారూ? మంత్రిని కనుక్కుంటాను!" అన్నాడు.

రాజుగారి వాదనకు మంత్రి కంపరమెత్తిపోయినాడు.

"తుచ్ఛమైన స్త్రీపురుష సంబంధాన్ని పవిత్రంచేస్తుంది వివాహం!" అని మంత్రీ, "పవిత్రమైన స్త్రీపురుష సంబంధాన్ని తుచ్ఛం చేస్తుంది!" అని రాజూ కాస్సేపు వివాదించుకున్నారు. పెళ్ళనేది ఉండబట్టే కట్టుబాటూ, సంఘమూ అంటూ ఉందన్నాడు మంత్రి. వివాహం వల్లనే మనిషికీ మనిషికీ కుటుంబానికీ కుటుంబానికీ మధ్య గోడలు ఏర్పడి సంఘబుద్ధి లేకుండా పోతున్నదన్నాడు రాజు.

"వివాహసంస్థ మీకేమపకారం చేసిందిప్పుడు?" అని మంత్రి అసలు విషయానికి వచ్చాడు.

"మరొకరిభార్యను నేను ప్రేమించాను. ఆమనిషి తన భర్తనించి విడిపడటం ఎల్లా? వివాహం పవిత్రమంటారు. ఆమె వివాహం పవిత్రమన్నవాడినోట పురుగులు పడ్డాయి!"

మంత్రి ఆలోచించాడు.

"ధర్మమూ ఆచారమూ ఆవిధంగా ఉన్నై, ప్రభూ. మనమేమీ చెయ్యలేం."

"వట్టి అర్థంలేనిమాట. నేను చేసిచూపిస్తాను."

"మీరు తొందరపడి ఏమీ చెయ్యకండి!"

రాజు మండిపడ్డాడు.

"నారాజ్యం అమిత అన్యాయంగా ఉందని నాకింత వరకూ తెలియదు. బలవంతుడు బలాత్కారంగా వివాహం చేసుకుంటే అది కూడా పవిత్రమైన వివాహమే?"

"వెనక రాక్షసవివాహాలు కూడా ధర్మసమ్మతంగానే ఉండేవి. కాని రానురాను అటువంటి వివాహాలు రద్దు చెయ్యటానికి ధర్మశాస్త్రం ఒప్పింది. ఈనాడుకూడా వంచనతో జరిగే వివాహాలను రద్దుచేస్తున్నాం."

"అల్లా అయితే ధర్మశాస్త్రం ఇవాళనించీ ఇష్టంలేని వివాహాలన్నీ రద్దు చెయ్యటానికి ఒప్పుకుంటుందని చాటింపించండి."

"అల్లా అయితే ఏ స్త్రీ అయినా భర్తతో కాపరం చేస్తుందా ?"

"పోనివ్వండి, చెయ్యకపోతే !"

"తమరు —"

"పెళ్లాలను ప్రేమచేత కట్టేసుకోలేక ధర్మం చెప్పే వెధవలకు శిక్ష కావలసిందే. ఆ ప్రకారం చెయ్యండి. మీకు చాతకాకపోతే నేను స్వయంగా చేయిస్తాను. నేనివాళ సభలో ఈవిషయం మాట్లాడుతున్నాను."

రెండు వందలమంది సభ్యులు. అందులో తార్కికులున్నారు, పండితులున్నారు. కాని రాజుతో ఒక్కరు వాదించలేకపోయినారు. కేవలమూ నాస్తికుడైన వాడితో ఎట్లా వాదించటం?

"భార్యాభర్తలలో ఎవరికి ఎవరిమీద అసంతృప్తి కలిగినా సరే ఆవివాహం రద్దుచెయ్యవచ్చునని మా శాసనం. దీనికి పండితులంతా ఆమోదించారని మేము అభిప్రాయ పడుతున్నాం!" అంటూ రాజు సభలోనించి లేచి వెళ్లిపోయినాడు.

౫

ఈ విడాకుల శాసనం అమలులోకి రాగానే సంఘం మంత్రిగారనుకున్నంతగా అల్లకల్లోలం కాలేదు. దీన్ని సహాయంచేసుకుని ఎంతోమంది తమభార్యలనూ భర్తలనూ వదిలించుకోవటానికి త్వరపడలేదు. ఈశాసనం ఉపయోగపరుచుకున్న కొద్దిమంది కూడా విశేషం మర్యాదస్తులూ నీతిపరులూ కాకపోవటంచేత ఇది నీతిగలవాళ్ళకు పనికివచ్చే శాసనం కాదనే అభిప్రాయం ప్రజల మనస్సులో కలిగిపోయింది. అదికూడా కాక ఒకసారి భార్యలనూ భర్తలనూ వదిలేసిన వాళ్ళలో కొందరు తిరిగి వివాహం జోలికిపోక స్వేచ్ఛగా తిరగసాగారు.

ఈ జాతిలో చేరింది వాసంతిక.

"ఈదిక్కుమాలిన శాసనం వివాహంయొక్క పవిత్రత పాడుచెయ్యటానికీ అవినీతిప్రచారం చెయ్యటానికీ వచ్చింది" అని రహస్యంగా పెద్దలంతా విమర్శించారు. విడాకులు ఇవ్వటం భరించవలిసిన సాంఘికదురాచారంగా పరిణమించింది.

కాని ఈశాసనం మూలకంగా రాజుగారిమీద అనేకమందికి అభిప్రాయంకూడా మారింది. ఆయన ఆస్థానంలో వున్న యావన్మందితోనూ ఎల్లాతర్కించిందీ వారికి తెలిసిపోయింది. వారివిడాకులశాసనాన్ని ఆమోదించారు.

వాసంతికా తేజస్వుల ప్రణయాన్ని ఒక ఆస్థానకవి గంగతో పోల్చాడు. అది ఎత్తున హిమాలయ పర్వతాల

మీద ఒక చీకటి గుహలో రహస్యంగా చిన్న జలగా బయలుదేరింది. అక్కడినించి శరవేగంగా అమిత దూకుడుతో రాళ్ళూ రప్పలూ లక్ష్యంచెయ్యకుండా పరిగెత్తుతూ వచ్చి అంతకంతకూ మహాప్రవాహమై సముద్రప్రదేశం ప్రవేశించిందట. ఆతరవాత అది గంభీరమైనవాహిని అయి ఇతర నదులనుకూడా తన గర్భంలో ఇముడ్చుకుని తను వెళ్లినంతమేరా భూదేవిని పవిత్రమూ సారవంతమూ చేస్తూ అపారజలాశయమైన సముద్రుడిని చేరి వెళ్లిందట. మానవజాతి అందులో స్నానంచేసి ధన్యులైనారట.

వాసంతిక రాజుకు సంతానాన్ని కన్నది. ఉద్రేకంతో ప్రారంభమయిన వారిబంధం ఉద్రేకం వెనకపడ్డ తరవాత కూడా నిలిచిపోవటమేకాక మరింత దృఢమై చలనం లేనిదిగా పరిణమించింది. రాజుగారు ఆమెను వివాహంమటుకు చేసుకోలేదు.

వివాహం విషయం రాజుగారి పూర్వపుఅభిప్రాయం మారనేలేదు తనకూ వాసంతికకూ ఆమెపిల్లలకూ ఉన్న సంబంధాన్ని ఎవరూ గౌరవించటం లేదని అతనుగమనించాడు.

ఒకనాడు వాసంతికాదేవి తన ఇద్దరుపిల్లలతోనూ తోటలోవున్న రాజును చేరబోతూ ఉండగా మార్గ్యదారిలో ఒక చిత్రమైన సంఘటనం జరిగింది. ఒకచోట కొందరు గుంపుకూడారు. అదంతా కుమ్మరవాళ్ళ గూడెం. ఒక ముసలికుమ్మరి పదహారేళ్ల కూతుర్ని తన ఇంటిబయట పడేసి చావకొడుతున్నాడు. ఆపిల్ల చూసేవాళ్ళ గుండెలు

కరిగేటట్టు ఏడుస్తున్నదికాని అక్కడ చేరినవారెవరికీ హృదయాలున్నట్టు కనిపించలేదు. తండ్రిని వారించాలని గాని కూతురికి అడ్డం వెళ్లాలనికాని ఎవరూ ప్రయత్నించటం లేదు.

ఈ దృశ్యం వాసంతిక కళ్లపడ్డది. ఆమె శకటాన్ని ఆపు దలచేసి కమ్మరి వాణ్ణి పిలిపించి, "నీకు బుద్ధిలేదురా, పశువా? ఎందుకా పిల్ల నట్లాచంపేస్తున్నావు?" అని అడిగింది.

"నాదేందమ్మా, ఈ లంజతొత్తుది పెళ్లీ పెటాకులూ లేకుండానే కడుపు చేసుకొచ్చింది గదా, నాపరువేం కావలి?"

వాసంతిక నోటమాటరాలేదు. ఆమె హృదయం భరించ రాని విషాదంతో నిండిపోయింది. ఆమె తోటకు చేరగానే ఆవిషాదం గమనించాడు రాజు.

"ఏం జరిగింది? అంత దిగులుగా ఉన్నావేం ?"

"మొగుడు లేకుండా పిల్లలను కన్నందుకు మానాన్న నన్ను వీధిలో కీడ్చితన్నితే నాకెట్లా ఉంటుందో నేనింతకు ముందే తెలుసుకున్నాను."

వివరాలన్నీ తెలుసుకుని రాజు మండిపోయినాడు. ప్రజలు మూఢులుగా ఉండటానికి అతనికేమీ అభ్యంతరం లేదుకాని ఆమూఢత్వం తన సుఖానికి అంతరాయం కలి గించటం ఆస్వార్థపరుడికి దుర్భరమయింది.

"పెళ్లిళ్లు రద్దుచేసి వెయ్యాలని రేపుచాటించండి. ఇక ముందు పెళ్లి అనేది జరగరాదు. ఇష్టం ఉన్న స్త్రీ పురుషులు ఒకచోట ఉండవచ్చును. స్త్రీ పురుషులకు ఒకరి మీద

ఒకరికి ఏ అధికారమూ లేదు. ఏ స్త్రీ కన్న పిల్లలు ఆమె పిల్లలే. ఇప్పటి వరకూ ఇది ధర్మంకింద పరిగణించబడటం లేదల్లే ఉంది. నారాజ్యంలో తల్లులు తమపిల్లలను రహస్యంగా హత్య చెయ్యవలిసిన స్థితిలోనూ గర్భస్రావాలు చెయ్యవలిసిన స్థితిలోనూ ఉంటున్నారని తెలిసింది. ఇక ముందు అటువంటి ఆవశ్యకత లేదు."

"వివాహాలు రద్దుచెయ్యడం సాధ్యమా, ప్రభూ?"

"ఎందుకల్ల కాదూ?"

"ఎవరు ఎవరి పిల్లలో ఎట్లా తెలియటం?"

"వివాహాలయితే తెలుస్తున్నదా? మీ తండ్రి ఎవరో మీకు తెలుసునా? నా తండ్రి ఎవరో నే నెరగను. పిల్లలంతా తల్లుల సంతానం. వివాహమంటూ ఉన్నంతె కాలమూ ఆ రహస్యం ఎవరికీ తెలిసేటట్టు కనిపించదు. ఇక ముందు బాగా తెలుస్తుంది. దయచేసి నేను చెప్పిన ప్రకారం శాసనం చెయ్యండి!"

మంత్రి మారు మాట్లాడలేదు. కాలానికేదో తిప్పలు వచ్చినవని ఆయనకు తోచింది. కొత్తశాసనం విన్నతరవాత ప్రజలకు కూడా అట్లాగే తోచింది.

ఈశాసనం అమలులోకి రాగానే దేశం అట్టుడికినట్టు ఉడికిపోయింది. ఈశాసనాన్ని ఆధారం చేసుకుని కొందరు స్త్రీలు సాహసించి తమ భర్తల ఎదటనే పరపురుషుల స్నేహం ప్రారంభించారు. అది సహించలేని ఇద్దరుముగ్గురు భర్తలు భార్యలను హత్య చేసేశారు.

ఈ విషయం మంత్రిగారు రాజుతో చెబితే రాజు

"నాకేమిటి? హత్యలు జరగనీ. ఎవరిమూఢత్వానికి వారు ఆమాత్రం నష్టమైనా పొందకుండా ఎట్లా? నాశాసనం తిరగదు," అన్నాడు.

పూర్వపు భర్తల అసూయకన్నకూడా తీవ్రసమస్య మరొకటి దేశంలో బయలుదేరింది. అది స్త్రీయొక్క ఆర్థిక సమస్య. పితృదేవతలకు ఊర్ధ్వలోకాలిచ్చే మినమీద జరుగుతున్న వివాహాలు స్త్రీయొక్క ఆర్థికసమస్యను పరిష్కారంచేస్తూవచ్చినై. ఇప్పుడు స్త్రీలూ పిల్లలూ ఎండిన చెరువులో జలచరాలల్లే బయటపడిపోయినారు. వేశ్యావృత్తిచేసి మగవాళ్ళధనాన్ని సంపాదించటంతప్ప వారికిప్పుడు మార్గాంతరంలేదు. ఇందులో అందరికీ సమానమైన ప్రావీణ్యత లేకపోవటంచేత ఎక్కువమంది స్త్రీలకు జీవితం దుర్భరమయింది. పిల్లలు అందరికీ బరువైనారు. స్త్రీల ఆత్మహత్యలూ, శిశుహత్యలూ, భ్రూణహత్యలూ జాస్తిఅయినై. వివాహం తీసేసి రాజు లోకానికి ఏబాధ తొలిగించుదామనుకున్నాడో ఆబాధ పదింతలయింది.

ఇదంతా మంత్రిగారు మొరపెట్టుకుంటే రాజు వినిపించుకోలేదు; మామూలుప్రకారం "అదంతా నాకేమిటి ?" అన్నాడు.

సంఘం ఎటువంటి శాసనానికైనా అలవాటు పడుతుంది. కొద్దికాలంలో వివాహం ఎరగని సంఘం ఒకటి దేశంలో వేళ్ళుపాకింది. స్త్రీలు పూర్వం పాతివ్రత్యం అభ్యసించినట్లు ఇప్పుడు శృంగారం అభ్యసించారు. ఏ ఆడ

దాన్ని కదిలించినా రసికత్వంలో ఆరితేరినదే. ఆస్తులన్నీ క్రమంగా ఆడవాళ్ళకు సంక్రమించినై. మంత్రిగారు దూరం ఆలోచించలేదుగాని ఇల్లా జరగకుండా ఉండటం అసంభవం. భార్యాబిడ్డలులేక రెక్కలమీద జీవించగల మగవాడు ఆస్తికోరడు, ధనం నిలవచెయ్యటానికి ప్రయత్నించడు. అతనికి అన్నింటికన్నా ముఖ్యంగా కావలసింది స్త్రీ. వెనకటిరోజుల్లో ఎంత ఆస్తిపరుడైనా తన భార్యవల్ల ఎంతసుఖముంటే అంతకే నోచుకునేవాడు. ఇప్పుడు అల్లా కాదు. డబ్బుపెట్టినకొద్దీ ఎంతసుఖమైనా ఉంది. ఆడబ్బుకుమరొకప్రయోజనం లేదుకూడానూ. చాలాత్వరలోనే మగవాళ్ళ ఆస్తులన్నీ ఆడవాళ్ళపరం అయినై. అందువల్ల మగవాళ్ళకు కలిగిన నష్టం ఏమీలేకపోగా ఆడవాళ్ళ ఆర్థికసమస్య పరిష్కారం అయింది. వెనకటిరోజుల్లో ఆస్తిపరుడు తన ఆస్తిలో వేశ్యకు ఒక భాగం ఇచ్చినా పెద్ద తప్పుగా గణించబడేది. ఎందుచేతనంటే ఆ ఆస్తి అతని పిల్లలు తరతరాలా అనుభవించవలసినది. ఆ ఆస్తి కొంతపోగొట్టి ముందురాబోయే తరాల వారందరికీ ద్రోహం చేసినవాడైనాడు; వేశ్యతో సంపర్కం పెట్టుకుని భార్యకు ద్రోహం చేసినవాడైనాడు.

సాంఘికమైన ద్రోహానికి అవకాశం తగ్గటంవల్లా ఆస్తీ సంపాదనా కూడా ఒకరికే (మగవాళ్ళకే) ఉండకపోవటంవల్లా వెనకటికన్న ఇప్పుడే సంఘం బాగుందని చాలామంది బుద్ధిమంతులు అభిప్రాయపడ్డారు.

## ౬

రాజుగారికి నడివయస్సులో ఒక విచిత్రమైన సౌఖ్య దాహం పుట్టుకొచ్చింది. ఆయనకు జీవితంలో చింత తక్కువై సుఖాలు ఎక్కువవుతున్న కొద్దీ ఈ దాహం జాస్తి అవుతున్నట్టు కనిపించింది.

తను బయటికి పోతే అంతమంది దరిద్రులూ రోగులూ ఎందుకు కనిపిస్తారూ? వీధులు అంత అసహ్యకరంగా ఎందుకుండాలీ? మురుగూ దుర్గంధమూ దేనికీ? తను వెళ్లినచోటనల్లా పోట్లాటలో ఏడుపులో ఎందుకు వినిపించాలీ?

"ఇదంతా నేను సహించను. దీనికంతకూ ఏదైనా ఏర్పాటు చేయించాలి. నేను పరిశుభ్రంగా ఉండటం ఎంత అవసరమో నాకు పరిశుభ్రమైనవాళ్లు కనిపించటం కూడా అంత అవసరంగా కనిపిస్తున్నది!" అన్నాడు రాజు ముసలి మంత్రితో.

"లోకంలో ఉన్న పాపాన్ని మనం ఎట్లా తీసివెయ్యగలం, ప్రభూ?" అన్నాడు మంత్రి.

"మీ అసమర్థత నాకు ఆశ్చర్యం కలిగిస్తున్నది. ఈ గుడ్డివాళ్ళూ, కుంటివాళ్లూ, కుష్టువాళ్లూ, తిండికీ గుడ్డకూ లేనివాళ్ళూ వీధుల్లో కనపడకుండా శాసనం చెయ్యండి; లేకపోతే వాళ్ళను పట్టుకుని ఉరితీయించెయ్యండి! ఏదో ఒకటి చెయ్యండి వెంటనే! ఇళ్ళ ముందరి భాగాలు శుభ్రంగా అట్టేపెట్టుకోని వాళ్ళను ఖైదు చెయ్యండి.

మురికి ప్రదేశాలన్నీ శుభ్రం చేయించండి. ఎవరూ బిగ్గరిగా పోట్లాడ కూడదనీ బిగ్గరిగా ఏడవకూడదనీ శాసనం చేసి అందుకుగాను ఉద్యోగస్థులను ఏర్పాటు చెయ్యండి. ఎవడైనా తనపని సరిగా చెయ్యకపోయినట్లయితే తలతీయించేస్తాను. పనిసరిగా జరుగుతున్నదో లేదో నేను స్వయంగా రాజ్యమంతటా తిరిగి విచారిస్తాను."

ముసలి మంత్రికి గుండె దడదడలాడింది. ఈ రాజుతో ఆయన ఇరవై సంవత్సరాలనించీ ఎట్లాగో నెగ్గుకొస్తున్నాడు. కాని రాజు మరుక్షణంలో ఏమి ఆజ్ఞాపిస్తాడో ఆయనకీనాటికీ తెలియదు.

"చిత్తం, క్రమంగా మీరు చెప్పిన ఏర్పాట్లన్నీ చేస్తాను."

"వారం రోజులు గడువిచ్చాను!" అన్నాడు రాజు.

సరిగా మళ్ళీవచ్చే ఆవారం నాటికే రాజు వాసంతికాదేవినీ పిల్లలనూ వెంటపెట్టుకుని రాజ్యమంతా తిరిగి రావటానికి బయలుదేరాడు.

రాజనగరు యావత్తూ చిన్నస్వర్గంగా తయారైఉంది. రాజు సంతోషించాడు. కాని ఇతర పల్లెలూ ప్రదేశాలూ చూసేటప్పటికి ఆయన ఆగ్రహం పట్టలేక పోయినాడు. కొత్తగా నియమించబడిన ఉద్యోగస్థులు చెమట ఓడ్చి పనిచెయ్యటమే కనపడ్డది కాని ఫలితాలు లేవు.

ఒకచోట ఒకఇంటిముందర ఇద్దరు రోగులను రాజభటులు వీధిలోకి ఈడ్చికొరడాలతో చావగొట్టుతున్నారు. వాసంతికాదేవి ఆదృశ్యం చూడలేకపోయింది.

రాజు బండి ఆపి దిగి భటులను సమీపించి, "ఎవరా

మీారు? ఏం చేస్తున్నారు?" అని గర్జించాడు.

"చూడండి, మహాప్రభో! వీళ్ళు రోగగ్రస్తులు, వీధుల వెంట తిరిగి అడుక్కుతింటున్నారు."

"అయితే?"

"న్యాయప్రకారం వీళ్ళని ఉరితియ్యాలి. అంతవని దేని కని భయాన చెప్పిచూస్తున్నాం."

"వాళ్ళని దయతో ఉరితియ్యటం కన్న నిర్దయగా కొరడా దెబ్బలు కొట్టటం మీాబుద్ధికి ఘనంగా తోచిందా? నాశాసనం ఇట్లా పాలిస్తున్నారా, పశువుల్లారా?"

రాజు దండితుల వంక తిరిగి, "మీారు రోగం ఎందుకు నయంచేసుకోరాదూ?" అని అడిగాడు.

"ఆగర్భదరిద్రులం మాకెవరు మందిస్తారు, తండ్రీ? నలుగుర్నీ అడుక్కోకపోతే మేమెట్లా జీవించగలం?" అని వాళ్లు సమాధానం చెప్పారు.

రాజు తన రాజ్యంలో ఉన్నదారిద్ర్యం చూస్తూ వస్తున్నాడు. ఆయన ఇప్పుడు అకస్మాత్తుగా తన రాజ్యపర్యటనం కట్టిపెట్టి తన నగరానికి వచ్చేసి మంత్రిగారిని పిలిపించాడు.

మంత్రిగారు వచ్చి "ఏమిటి సెలవు?" అన్నాడు.

"నారాజ్యంలో ఇంత దారిద్ర్యం ఎందుకున్నది? అందరికీ సరిపడా ధాన్యమూ, గుడ్డలూ లేవా?"

"ఉండకేం, ప్రభూ? అందరికీ డబ్బు లేదు."

"ఎందుకు లేదు?"

"డబ్బు సంపాదించటం అందరికీ సాధ్యమవుతుందా?

పనిచెయ్యని సోమరు లెంతమంది లేరు ?"

"నేను పనిచెయ్యని సోమరేని కానా ? నాకు దారిద్ర్యం లేదేం? అయినా డబ్బున్నవాళ్ళేవరూ పనిచెయ్యగా నేను చూడలేదు. రోజల్లా కష్టపడి పనిచేసేవాడిదగ్గర డబ్బు స్పష్టంగా కనిపించటమూ లేదు. అసలు డబ్బనేదిలేకపోతే ఏమిటి నష్టం ? "

"ఏదైనా కావాలంటే ఎల్లా కొనుక్కుంటారు ? "

"కొనుక్కోలేకపోతే ఊరికే తీసుకుంటారు."

"ఎవరిస్తారు, ప్రభూ ? "

"ఒకరిచ్చేదేమిటి ? చెరువులోనీళ్ళు ఎవరిస్తున్నారు ? అందులో నీకు కావలిసినంతే నువ్వు తాగుతున్నావు. ధాన్యమైనా అంతే. మనకక్కర్లేని ధాన్యం మరొకరికి ఇవ్వక ఏంచేస్తాం ? డబ్బుకు ప్రచారంలేకుండా శాసనం చేయించండి ! "

"అన్నీ ఊరికేవచ్చేటట్టయితే ఎవరైనా పనిచేస్తారా ?"

"ఎవరూ పనిచెయ్యకపోతే ఏదీరాదు. నేను చెప్పిన ప్రకారం శాసనం చేయించండి."

## 2

డబ్బుకు విలవలేదనీ క్రయవిక్రయాలు జరగరాదనీ చాటింపు జరగగానే దేశం అల్లకల్లోలమైపోయింది. ఈ వార్త బీదలకూ భాగ్యవంతులకూకూడా ఆదుర్దాకలిగించింది. "సిరిసంపదలన్నీ ధనికులకేఉన్నై. క్రయవిక్రయాలు

లేకపోయినా వారికి నష్టం లేదు, మన పనిసున్నా అయింది" అనుకున్నారు బీదలు. "మనదబ్బంతా విలవలేనిదైపో తేమన మెందుకూరొరగాం" అని దిగులుపడ్డారు భాగ్యవంతులు.

పెద్దలంతా రాజుగారి ఈశాసనంమీాద ఉద్రేక పూరితమైన చర్చలు చేసారు. "రాజుగారికి మతిచెడి పోయింది!" అని వారంతాఏకగ్రీవంగా ధృవపరిచారు.

దరిద్రులు తండోపతండాలుగావచ్చి రాజభవనంచుట్టు ముట్టి "మాగతిఏమిటి, ప్రభూ ? " అని గోలపెట్టారు.

"మీారు దేనికీ ఇక బాధపడవద్దు. నేను కొందరు ఉద్యోగస్థులను నియమిస్తున్నాను. మీారు పండించే ధాన్యమూ తయారుచేసే వస్తువులూ అన్నీ తెచ్చి వారికి వప్పచెప్పి వారినడిగి మీారు కావలిసినవస్తువులు పుచ్చుకోండి. అవసరమైన సహాయంపొందండి. మీాకేమేంపనులు చాతనవునో మీాపేర్లేమిటో అదంతా నాఉద్యోగస్థులకువచ్చి చెప్పుకోండి. మీారడిగినవన్నీ వాళ్లు చేస్తారు," అనిరాజు సమాధానం చెప్పాడు.

అప్పటికీ ప్రజలకు తృప్తి కలగలేదు. రాజుగారి అభిప్రాయం అందరికీ అర్థంకాలేదు. కాని రాజుగారి యందు విశ్వాసం ఉంచి వాళ్ళు తమతమ పనులమీాద వెళ్ళిపోయినారు.

ఈకొత్తయేర్పాటుతో దేశం బాగుపడుతుందని ఒక అభిప్రాయమూ, ఇదంతా విలయానికే వచ్చిందనే మరొక అభిప్రాయమూ తీవ్రంగా ప్రచారం అవుతున్నై.

ఈలోపల రాజనియోగులు తలా ఒక పల్లె పంచుకుని

వృత్తులవారీగా మనుష్యులపేర్లూ వారి శక్తిసామర్థ్యాలూ జాబితాలు తయారుచేస్తున్నారు.

ఊరూరా ఖజానాలు తయారవుతున్నై. ఏవూరిలో తయారయేసంపద ఆవూరిఖజానాకు చేరుతుంది. ధాన్యమూ, బట్టలూ, చెప్పులూ, చెంబులూ, కొయ్యసామగ్రీ మొదలైన రకరకాల వస్తువులన్నీ జాబితా వెయ్యటం ఖజానా దారు పని. ఊళ్లో వాళ్ళంతా ఖజానాకు వచ్చి తమకు కావలిసిన వస్తువులు ఖజానాదారు నడిగి తీసుకు పోవాలి ఏవదార్థం గానీ సమృద్ధిగా ఉన్నప్పుడు ఆవృత్తివారు శెలవుతీసుకుని విశ్రాంతి తీసుకోవచ్చును, లేదా ఇష్టమైతే ఇతర పనులు చేసేవారికి సహాయం చెయ్యవచ్చును. వారానికొకసారి ప్రతి ఖజానా తాలూకు జమాఖర్చులూ రాజనగరం వెళ్లాలి. ఒక ఖజానానించి మరొక ఖజానాకు వస్తువులను మార్చవలిసిన అవసరం ఉన్నప్పుడు రాజనగరం నించి ఆర్డరు వస్తుంది.

ఇళ్ళకట్టేవాళ్ళూ వైద్యులూ మొదలైనవాళ్ళు ఇళ్లిల్లూ తిరిగి ఎవరెవరికి ఏమేమి కావాలో కనుక్కుంటూన్నారు.

తాత్కాలికంగా సంఘంలో కలిగిన తారు మారు చూసి కొందరు తలలు పంకించారు. ఏ చీకూ చింతా లేకుండా ఇంట్లో కూర్చుని హాయిగా కాలం గడిపిన పెద్దలు ఖజానాదారు—మామూలు ఉద్యోగస్థుడు—దగ్గరికి వెళ్లి "దేహి" అని అడిగవలసివచ్చింది! "దేహి" అని అడిగినా చేతులో ఎర్రఏగానీ పడని అసంఖ్యాకుల సంగతి ఎవరూ విచారించ లేదు.

"సున్నం కొడుతున్న ఇల్లు. తొందర పడకండి కాస్త ఓపిక పట్టండి!" అన్నారు కొందరు బుద్ధిమంతులు.

కాలక్రమాన సంఘంలో మళ్లీ కుదురుబాటు కలిగింది. దేశంలో దరిద్రం లేకుండా పోయింది. మంత్రి చాలా పొరపాటు పడ్డాడు. తమకోసం తాము పాటుపడినప్పటి కన్న సంఘంకోసం జనం మరింత ఎక్కువగానూ బాగానూ పాటుపడగలిగారు. దరిద్రుడు పూర్వం చెయ్యవలిసి వచ్చే చాకిరికి అంతూ పొంతూ ఉండేదికాదు. ఇప్పుడు సంఘం చాకిరి చాలా పరిమిత మయింది. అన్నిరకాలవాళ్లకూ బోలెడంత విరామమూ విశ్రాంతీ దొరకింది. వెనకటి ఆర్థిక పరిస్థితుల్లో సంఘానికి ఎందుకూ పనికిరానట్టు కనపడిన వ్యక్తులు అనేక మంది ఈ ఏర్పాటువల్ల సంఘానికి చాలా ఉపయోగపడగలవా రయినారు. డబ్బు మాయం కాగానే మనుష్యుల్లో గుప్తంగా ఉన్నశక్తి యావత్తూ ఒక్కసారిగా బయటికి వచ్చినట్టయింది.

సోమరి తనానికి రాజుగారు శిక్ష ఏమీ విధించలేదు. కాని సోమరితనంసంపూర్ణంగా అడుగంటింది. దేశసంపదను అభివృద్ధి చేసే ప్రయత్నం ప్రతివాడి స్వంతపనీ అయింది. అందులో అడుగున చిక్కినవాడు సంఘంలో అడుగున చిక్కినవాడయినాడు. సంఘంలో డబ్బు నంపాదించటమే ప్రతివాడికీ స్వంతపని అయినంత కాలమూ అందులో వెనక పడినవాడు సంఘంలో వెనకపడినట్టే.

డబ్బు నంపాదించడం మానవుడి ఆశయం అయినంత కాలమూ కుయుక్తులకూ, లంజరికానికీ, చోరత్వానికీ,

సమస్త పాపాలకూ అవకాశం ఉండింది. కాని సంపద కుయుక్తులతోనూ, లంజరికంతోను, చౌర్యంతోను పెంపొందేది కాదు. ఇందువల్ల కొంత సత్కర్మ కూడా నశించింది. దాతృత్వమూ, తక్కువవాళ్ళయందు సమభావమూ వాత్సల్యమూ మొదలైనవి నశించినై. కాని ఈ పుణ్యాలన్నీ మనిషి అహంకారాన్ని తృప్తిపరిచేవే కాని నిజమైన పుణ్యాలు కావనే అభిప్రాయం బుద్ధిమంతులలో మొదటినించీ ఉంటూనే ఉండింది. తనది ఉత్తమకులమని ఒప్పుకుంటే తక్కువ కులం వాళ్ళయందు సమయోచితంగా దాక్షిణ్యం చూపటానికి చాలామందికి అభ్యంతరం ఉండదు!

దారిద్ర్యం తొలగగానే జనం యొక్క ఆయురారోగ్యాలు జాస్తి అయినై. దారిద్ర్యం వ్యక్తికి సంబంధించినది కాదు, సంఘానికి సంబంధించినది. సమస్త అజ్ఞానమూ రోగాలూ దారిద్ర్యం మూలంగానే కలుగుతై. ప్రభుత్వం దారిద్ర్య సమస్యను పరిష్కరించుకునే బాధ్యత వ్యక్తులకు వదిలి రోగాలనూ అజ్ఞానాన్నీ కట్టుబాటులో ఉంచటానికి చేసే ప్రయత్నాలు హాస్యాస్పదంగా ఉంటై.

## ౨

తేజస్వి వృద్ధుడైపోయినాడు. కాని ఆయన హృదయం ఇంకా యవ్వనంలోవుంది. ఆయన స్వార్థబుద్ధి సంపూర్ణంగా తృప్తిపడింది. ఎక్కడికి వెళ్ళినా ఆయనకు స్వర్గమూ, దేవ

తలూ కనిపిస్తూఉంటారు. ఆయనకు ఏకారణంవల్లగానీ ఎటువంటి బాధా లేదు.

మంత్రిగారి మరణానంతరం ఆయన మళ్ళా మంత్రిని పెట్టుకోలేదు. ఆయనకు మంత్రిగారి అవసరం కనిపించలేదు. ఆయన స్వయంగా శాసనంకూడా చెయ్యటంలేదు: సంఘానికి ఏమికావాలో సంఘం ఎరుగుననే మిషమీద శాసనం ప్రజలచేతిలో పెట్టేశాడు. ఆస్థానానికి ఎవరైనా రావచ్చును, ఏవిషయమైనా చర్చించవచ్చును. బుద్ధిమంతులందరూ కలిసి సంఘంచాకిరి తేలిక కావటానికి ఎటువంటి ఏర్పాట్లయినా చెయ్యవచ్చును. తను మాత్రం నామమాత్రుడుగా సింహాసనంలో కూర్చుని తీర్మానాలకు తన ముద్ర వేశాడు.

"మానాన్నగారి హయాంలో మంత్రిగారు చాలా సమర్థుడని చెప్పుకునేవారు. నేను అధికారం పుచ్చుకున్న తరవాత నాచేతిమీదిగా చేసిన శాసనాల్లో ఒక్కదానికి కూడా ఆయన సమ్మతించినట్టు నాకు జ్ఞాపకంలేదు. నేను అనుభవంమీద తెలుసుకున్నాను—తప్పుడు పరిపాలన చెయ్యటానికి చాలాయుక్తి తెలివితేటలూ కావాలి. న్యాయమైన పరిపాలన చెయ్యవలసివచ్చేటప్పటికి మంత్రిగారికి నాకూ మీకూ ఉన్నంత సామర్థ్యం లేదని తేలిపోయింది" అన్నాడు రాజుగారు ఒకనాడు సభలో.

ప్రజల క్షేమానికి నిస్వార్థంగా పాటుపడినందుకు ఎవరో రాజుగారిని అభినందించారు.

తేజస్వి నవ్వుతూ తల అడ్డంగా తిప్పాడు.

"ఆ రెండూ అబద్ధాలే. నేను ప్రజలక్షేమమూ కోర లేదు, నిస్వార్థంగానూ పాటుపడలేదు. మొదటినించీ నా సుఖమే నేను చూసుకున్నాను. నాసుఖంతో యితరులసుఖం కూడా ముడిపడి ఉందనేసంగతి నాకు చాలాకాలం తెలియదు. నాకాసంగతి ఒక స్త్రీద్వారా తెలిసివచ్చింది. ఆమె సంపూర్ణంగా ఆనందించకపోతే నాఆనందం పరిపూర్ణంకాదనీ, ప్రపంచపరిస్థితులు మారితేగాని ఆమె ఆనందం పరిపూర్ణంకాదనీ నాకు తెలిసిరాగానే నేను ప్రపంచాన్ని మార్చటానికి పూనుకున్నాను. దైవం అనుకూలించాడు.

"ఇట్లా కాకుండా నాకు పరిపాలించటంలో అభిలాషఉండి న్యాయంగా పరిపాలించి ప్రజలక్షేమంకోసం పాటు పడ సాగినట్టయితే మాతండ్రిగారి మోస్తరుగానే నామటుకు నేను మంచిపేరు తెచ్చుకుని దాటిపోయిఉందును. ప్రజల కష్టసుఖాలు మామూలుగానే ఉండేవి. మాతండ్రిగారి పరిపాలనలో బాగుపడ్డ కొద్దిమందీ ఆయనది రామరాజ్యమని వదంతి పుట్టించారు.

"ఇంకొక రహస్య విషయం చెబుతాను. నేను చిన్నతనంలో మాతండ్రిగారిని జాగ్రత్తగా గమనించే వాణ్ణి ఆయిన జీవితంలో ఏమీసుఖపడలేదు. ఆయిన ఒక్కొక్క సారి రోజుల తరబడీ దిగులుగా ఉండటం నేనెరుగుదును. మొదటినించీ ఆయనకు అంతరాత్మతో హోరాహోరి యుద్ధమే. లోపల ఒకటీ బయటికొకటీ—ఆయన జీవితం అట్లాగే వెళ్ళిపోయింది. ఆయనకు నిజంగా ప్రజల గొడవ

ఎప్పుడూ పట్టలేదు. అన్యాయం చెయ్యటానికి న్యాయ మార్గాలు అన్వేషించటంలో ఆయన తల పగిలి పోయ్యేది. తనది న్యాయపరిపాలన అనిపించుకోవటానికి ఆయన కెందుకో అంత ఆదుర్దా!

"ఆయనను చూసి నేను మంచి పాఠం నేర్చుకున్నాను. నా అంతరాత్మతో నేనెన్నడూ కలహం పెట్టుకోలేదు. ప్రజలంటేనూ న్యాయమంటేనూ, పరిపాలన అంటేనూ నాకు క్రమంగా విముఖత్వం ఏర్పడ్డది. నాసుఖంలో తప్ప నాకు మరిదేనిలోనూ నమ్మకం కుదరకపోయింది. ఏదో విధంగా నాసుఖం నేను చూసుకోగలిగాను. నాజీవితం వృథాపోలేదు," అన్నాడు రాజుగారు.

సభ్యులంతా ఆమాటకు ఆమోదం తెలియజేశారు.

# స్వార్థం గురించి

చాలా సామాన్య విషయాలను గురించికూడా మనకు దురభిప్రాయాలుంటవనేది నిర్వివాదాంశం. వాటిని బుద్ధిమంతుడు ఒక్క క్షణంలో సంస్కరించుకోవచ్చును. కాని అవి ఒక్కొక్కప్పుడు శతాబ్దాల తరబడి సంస్కారం లేకుండా సర్వజనామోదం పొందుతూ ఉంటై.

మరొకరిలో తప్పులు వెతికేకాంక్ష అవిద్యవల్ల కలుగుతుంది. వ్యక్తులూ సంఘాలూ పరస్పర దూషణలో ఆత్మశక్తిని వ్యయంచేసుకుంటై. తండ్రి కొడుకునూ, అన్న తమ్ముణ్ణీ బ్రాహ్మణులు శూద్రులనూ, బీదలు భాగ్యవంతులనూ, స్త్రీలు పురుషులనూ, లేక రెండోవారు మొదటివారినీ ఏదోఒకవిధమైన దూషణకు గురిచెయ్యాచూస్తూ ఉంటారు. కాస్తజాగ్రత్తగా పరిశీలించి నట్లయితే ఏనేరాన్నికూడా సంపూర్ణంగా ఒకవ్యక్తి మీదగాని ఒక సంఘం మీదగాని ఆరోపించగలగటమనేది అసంభవం. కొడుకును తప్పుపట్టే తల్లిదండ్రులు ఆ కొడుకులో తమ ఇద్దరిలోనూ తమ పూర్వులలోనూ లేని గుణాలు లేవని విచారించరు. దొంగతనం చేసినందుకు కారాగృహ శిక్ష విధించే న్యాయచట్టం దొంగయొక్క దారిద్ర్యాన్ని లెక్కచెయ్యదు, దాన్ని సంస్కరించదూనూ.

ఇటువంటి నేరారోపణ తప్పని కూడా నాఅభిప్రాయం కాదు. అది కారణాంతరాలవల్ల తప్పని సరే కావచ్చును. కాని అటువంటి నేరారోపణచేసేవాళ్లు తాము చేస్తున్నది

శాస్త్రీయమైనపని కాదని తెలుసుకుంటే, ఆనేరారోపణకు ఉద్రేకం జత చెయ్యకుండా ఉంటే, జీవితం ఇంత దుఃఖ భాజనంగా ఉండదు.

అటువంటి అర్థంలేని ఆవేశం హింసద్వారా బయట పడుతుంది. తండ్రి కొడుకునూ, భర్త భార్యనూ, న్యాయాధికారి ముద్దాయినీ, హింసిస్తారు. హింసకు ప్రతిక్రియ లేదు. హింసించేబుద్ధి నేరారోపణ వెంట గుప్తంగా ఉంటుంది.

మనం చప్పున ఇతరులలో చూసి సహించ లేనిది స్వార్థం. దాన్ని తప్పుపడితే ఎవరూ మనని తప్పుపట్టరు. స్వార్థం చాలా హేయమైనదిగా గణించబడినట్టే స్వార్థత్యాగం చాలా ఘనమైనదిగా గణించబడుతున్నది.

కాని నాబుద్ధికి స్వార్థం దానికదే హేయమైనదిగా కనిపించదు. ఉత్తమ సంస్కారం వల్ల పోగొట్ట దగిన గుణాలను మాత్రమే పరిసించవచ్చుననీ, వాటిని వదిలించుకోవటానికి అటువంటి సంస్కారమే తప్ప వేరే మార్గంలేదనీ నేనభిప్రాయపడు తున్నాను. నాకు సంస్కారంలో ఉన్న విశ్వాసం శాసనాల యందూ శిక్షల యందూ లేదు. మానవ జీవితానికి శాసనమూ, శిక్షా స్వాతంత్ర్యం లేకుండా చేస్తున్నై. నేను స్వాతంత్ర్యప్రియుణ్ణి. మానవజీవితాన్ని మనస్సునూ సరియైనవిధంగా సంస్కరిస్తే ఆదర్శప్రాయమైన సంఘం తయారవుతుందనీ, మానవుడు పరిపూర్ణమైన స్వాతంత్ర్యానికి అర్హుడవుతాడనీ, అటువంటి సంఘంలో పరిపాలన మానవసేవారూపంలో ఉంటుందనీ, శాసనరూపంలో ఉండదనీ, నాదృఢనమ్మకం.

సంస్కారంవల్ల కామక్రోధాదులను జయించినట్టు స్వార్థాన్ని జయించటం అసంభవం. మనకళ్ళతో చూసేదే మనకుకనిపించి, మన నోట్లోపెట్టుకున్నదాని రుచే మనకు తెలిసి, మన కష్టసుఖాలే మనకు అనుభవం అయి, మనకు వ్యక్తిత్వం వదలనంతకాలమూ మనము స్వార్థపరులమే. ఇంకొకరి అనుభవంతో సానుభూతి పొందగలగటం మన స్వార్థం నశించటం కాదు; మన వ్యక్తిత్వమూ, దాని వెంట మన స్వార్థమూ విస్తరించటం అవుతుంది. సంఘం కోసమో ప్రేమకోసమో ఉద్రేకం లేకుండా ఆత్మార్పణ చేసుకోగలవాడిస్వార్థం పరిపూర్ణత్వం పొందిందనుకోవాలి.

వ్యక్తియొక్క ప్రయత్నమంతా మనసు సుఖపెట్టటమే. ఇంద్రియాలను తృప్తిచెయ్యటమనేది అర్థంలేని మాట; ఇంద్రియాలద్వారా మనసుసుఖపడలేకపోతే ఇంద్రియాలు ప్రత్యేకించి సుఖంకోరవు. సుఖదుఃఖాలేమిటో ఇంద్రియాలకు తెలియవు. శరీరం తనకు కావలసిన ఆహారాన్ని ఏవిధంగా సంగ్రహిస్తుందో తెలుసుకోవటం ఎంతకష్టమో మనస్సు తనసుఖాన్ని ఎటువంటి అనుభవంద్వారా పొందగలుగుతుందో తెలుసుకోవడం అంతకంటెకూడా కష్టం. ప్రేమకోసం ఆత్మత్యాగం చేసి అపారమైన ఆనందం పొందగల వాళ్ళు ఉన్నట్టే కనిపిస్తుంది.

కాని పులినిచూసి నక్క వాతలుపెట్టుకుంటే పుండవుతుంది. మనసు సంతోషం పొందకుండా చేసే ప్రతి చిన్న త్యాగమూ పశ్చాత్తాపానికీ మానసిక రుగ్మతకూ కారణభూతమవుతుంది. అటువంటి త్యాగాన్ని ఎవరూ చెయ్య

రాదు, హర్షించరాదు. వ్యక్తులు స్వార్థంలేని త్యాగం చేస్తూఉండటం సంఘానికి మంచిదికాదు. ఆవిషయం మన భార్యలద్వారా మనము తెలుసుకొనవలసినకాలం ఆసన్నమవుతున్నది. వారిచేత మనంస్వార్థరహితం—మానసికంగా ప్రతిఫలం లేనిది—అయిన త్యాగం చేయిస్తున్నారు. దానికి మనకు కలిగిన ఫలితం ఏమంటే ప్రేమలేని జీవితం.

స్వార్థం కుసంస్కారం వల్ల వికటిస్తుంది. అటువంటప్పుడు స్వార్థంలో అవలక్షణాలు కలుగుతై. అసూయా, అధికారవాంఛా, అపాయకరమైన ఆవేశమూ అటువంటి అవలక్షణాలే.

ఇప్పుడు మనలో ఉన్న ఆర్థికచట్టం అటువంటి దుర్గతి కలిగించింది స్వార్థానికి. మనలో ధనికులేకాక దరిద్రులు కూడా ఆ అవలక్షణాలు ప్రకటించుతున్నారు. వస్తువులను ఉపయోగించుకోవటమూ, సంపదను అవసరమైనంత వరకూ ఖర్చు చెయ్యటమూ స్వార్థంఅనిపించుకుంటుంది; కాని వస్తువులను స్వంతంచేసుకోవటమూ, మనకు ఉపయోగం లేనప్పుడుకూడా వాటిని మన హక్కులోనే ఉంచుకుని వాటివల్ల అవసరం ఉన్నవారికి అందనివ్వక పోవటమూ స్వార్థంకాదు—దాని తాలూకు అవలక్షణం. వస్తువులనుస్వంతంచేసుకోవాలనే ప్రయత్నం అందరిలోనూ సమానంగా ఉండటమేగాక అదిలేనివాడు క్షణంలో అడుగంటి పోతున్నాడు.

వస్తువులను స్వంతం చేసుకోవటం న్యాయమైనంత కాలమూ "నేను నిస్వార్థంగా జీవిస్తున్నాను!" అని

ఎవడూ చెప్పలేదు, (ఇక్కడ స్వార్థమనేది చెడుఅర్థంలో ఉపయోగించాను.) స్వార్థంయొక్క అవలక్షణాలను వ్యక్తులు జయించలేరని వేరేచెప్పనక్కర్లేదు. జాతియావత్తూ ఒకటిఅయితేగాని స్వార్థంయొక్క అవలక్షణాలు నశించవు. సరిఅయిన సామ్యవాదం ఇందుకు తోడ్పడుతుందనుకోవటానికి సందేహం ఏమీలేదు. కేవలమూ పెట్టుబడిదార్లను హత్యచేసి సాధించే సామ్యఫలితాలలోనూ, ధనికుల అవగుణాలను అటువంటి అవగుణాలతోనే ప్రతిఘటించే సామ్యవాదంలోనూ నాకు విశేషం నమ్మకంలేదు. ఒక జాతివారు దుర్వినియోగపరుస్తున్న హక్కులను అన్ని జాతులవారూ పంచుకుని దుర్వినియోగపరచటం ప్రారంభిస్తే ప్రపంచం బాగుపడుతుందని నాకు విశ్వాసంలేదు.